## మినీ కథ

ఎక్స్‌ప్రెస్ బస్ ఫుల్ స్పీడ్‌లో వెళ్తోంది. 'సార్ ఒకసారి మీ పెన్నిస్తారా?' ముందు సీట్లోంచి వెనక్కి తిరిగి అడిగాడు. జేబులో నుంచి బాల్‌పెన్ తీసి అందిస్తుంటే చూశాను. రెండు చేతులకు కలిపి బేడీలు, చెయిన్ ప్రక్కన పెట్టుకున్నాడు. ఆ ప్రక్క సీట్లో కానిస్టేబుల్ రైఫిల్ ఎదురు గుండా సీటుకి ఆనించి పట్టుకున్నాడు. ఎవరైనా ఎక్స్‌ట్రీమిస్టు బాపతేమో, లేదా ఎవరైనా పెద్ద నేరం చేసిన వాడేమో, తన జేబులో నుంచి చిన్న డైరీ తీసి ఒక పేజీ చించాడు.



## జననీ జన్మభూమి

మెల్లిగా అందులో ఏదో వ్రాస్తున్నాడు. బస్సు కదలికలో సరిగా వ్రాయలేకపోతున్నాడు. కానిస్టేబుల్ కునుకు తీస్తున్నాడు. అతని మీద పూర్తి నమ్మకమున్నట్లుంది. చైన్ కూడా పట్టుకోలేదు. అతనికి 30-32 సంవత్సరాల వయస్సున్నట్టుంది. నల్లగా, ఓ మోస్తరుగా పెరిగిన గడ్డం చిందర వందరంగా జుట్టు, మాసిన గీతల చొక్కా, బ్రౌన్ కలర్ పాంటు, అటు ప్రక్క భుజానికొక బ్యాగ్. పెన్, జాటర్‌లోనికి ప్రెస్ చేసి తిరిగి ఇస్తూ 'థాంక్స్' అన్నాడు. వ్రాసిన కాగితాన్ని చిన్నగా మడిచి చేతిలో పట్టుకున్నాడు.

ముందు సీటు క్రింద ఖాళీ అగ్గిపెట్టె ఒకటి వుంటే అది కాలితో దగ్గరకు లాగి అందుకున్నాడు. ఆ చిన్న చీటీని అందులో దూర్చాడు. బస్సు ఏదో ఊరి పొలిమేర లోకొచ్చింది. కిటికీ అద్దం వెనక్కి జరిపి దానిగుండా తలదూర్చి బయటకు చూస్తున్నాడు. ఊర్లోకి వస్తున్న పశువులను తప్పించుకుంటూ డ్రైవర్ స్లోగా వెళ్తున్నాడు. ఆ వూళ్ళో బస్ ఆగదు. పశువులు, గేదెలు అడ్డం వచ్చినప్పుడు దాదాపు ఆగి, బస్సు మళ్ళీ కదులుతున్నది. బస్సు గ్రామ అంచుకు వచ్చింది. అతను లేచి తల కిటికీగుండా బయటకు పెట్టి 'పాపా' చిన్నా, పాపా, చిన్నా' అని బిగ్గరగా పిలిచాడు. పెంకుటింటి ముందు అరుగుపై చదువుకుంటున్న ఏడేళ్ల పాప బస్ వైపు చూసి గుమ్మంలో వున్న తల్లితో 'అమ్మా!' బస్‌లో నాన్న పిలుస్తున్నారు అంది. ఇద్దరూ త్వరగా బస్సు దగ్గరకు వచ్చారు.

'నన్ను వరంగల్ సెంట్రల్ జెయిల్‌కు మార్చుతున్నారు. ఇదిగో, ఇందులో చీటీవుంది' అని అగ్గిపెట్టె బయటకు విసిరాడు. తల్లి ప్రక్కన నిలబడి పాప, 'నాన్నా' దిగునాన్నా, ఇంటికిరా నాన్నా, 'దిగు నాన్నా' అంటూంది.

పశువుల మందను ప్రక్కకు అదలించారు. బస్ మెల్లగా కదిలింది. నోటినుంచి మాట పెగలక, కన్నీళ్ళను అణుచుకుంటూ ఆమె అగ్గిపెట్టెను అందుకుంది. ఒక చేత్తో పాప చెయ్యి పట్టుకొని, రెండో చేత్తో వీడ్కోలు చెప్పింది. కనిపించే మేరకు అతను చేతులు బయట పెట్టలేక కళ్ళతో వీడ్కోలు చెప్పి కూర్చున్నాడు.

కళ్ళల్లో పెల్లుబికిన అశ్రువులు బస్‌లో జనం గమనిస్తారేమోనని కాబోలు జేబు రుమాలుతో ఒత్తి పట్టుకుని ఒక నిమిషం అలాగే కూర్చున్నాడు.

రెండు నిమిషాల అనంతరం అడిగాను ఉండబట్టలేక 'వాళ్ళు ఎవరు?' అని,

అతను తల ప్రక్కకు తిప్పకుండా చెప్పాడు.

'ఇది మా ఊరు. అదే మా ఇల్లు. ఆ పాప నా కూతురు. ఆవిడ నా భార్య. ముఠా తగాదాల్లో జరిగిన హత్య కేసులో నాకు లైఫ్ టర్మ్ పడింది' అన్నాడు.

ఆ తల్లీ, కూతుళ్ళ ఛాయా చిత్రం తిరిగి నా కళ్ళల్లో కనిపించింది.

మెల్లగా కరిగిపోతూంది కన్నీటి పొరల్లో-

డాక్టర్ సుధాకరరెడ్డి

## కాలమ్ దాటని కథ

### 'మంచి బేరం'

రాత్రి ఎనిమిది గంటలు. హోటల్ ప్రణవి ముందున్న పాన్‌షాప్ యమ రద్దీగా వుంది. 'ఒక కలకత్తాపాన్' 'ఏక్ బ్రిస్టల్ సిగరెట్' 'ఏక్ త్రివేణి' ఇలా అడుగుతున్నారు, అప్పుడే భోంచేసి వచ్చిన కస్టమర్లు. చకచకా పనిచేసుకుపోతున్నాడు పాన్‌షాప్ రంగయ్య. ఠక్కున కరెంట్ పోయింది.

అయినా, గిరాకీ తిరిగిపోకుండా మెలకువగా కస్టమర్స్ సంతృప్తిచెందేలా పనిచేస్తున్నాడు రంగయ్య. పావుగంట అయ్యాక కరెంట్ వచ్చింది.

రాత్రి తొమ్మిదిన్నరకి రంగయ్య దుకాణం కట్టేయడానికి తయారవుతున్నాడు. "ఏం బ్రదర్?! ఎలా నడుస్తోందిదుకాణం?" ప్రశ్నించాడు అప్పుడే వచ్చిన ప్రసాద్. "బాగానే" అన్నాడు రంగయ్య "కాని ఎనిమిది గంటలు ఆ ప్రాంతంలో అనుకుంటాను - మీ షాప్‌లో రోజూ కరెంటు పోతోంది. ఎందుకు?" అన్నాడు ప్రసాద్.

"పోతే పోనీ వెధవ కరెంట్" అని గట్టిగా అని "నేనే కావాలని ఫ్యూజ్ తీసేస్తున్నాను" అన్నాడు రంగయ్య మెల్లగా. "ఎందుకు?" "కరెంట్ పోతే మనం ఎలాంటి సరుకు పాన్‌లో వేసినా కనిపించదు. పైగా మంచి ఖరీదైన సిగరెట్టుకు బదులు చవక సిగరెట్ ఇచ్చినా గుర్తుపట్టరు జనం" అన్నాడు రంగయ్యసంతోషంగా.

రంగయ్య మాట్లాడుతూ, డబ్బు లెక్క చూసుకుంటున్నాడు. "అరే! ఆ యాభై నోటు చూడు!" అన్నాడు ప్రసాద్ ఆశ్చర్యంగా - "నకిలీది లాగుందే! ఎవడో దొంగవెధవ కరెంట్ లేనప్పుడు వో యాభై కాగితం ఇచ్చాడు" బాధతో అన్నాడు రంగయ్య.

అప్పటి నుంచీ - ఎనిమిది గంటలకు దుకాణంలో కావాలని ఫ్యూజ్ పీకేయడం మానేశాడు రంగయ్య.

బి. రఘురామరాజు